క్లుప్తంగా

గణపర్తి పాల సంఘానికి నలుగురు డైరెక్టర్ల ఎన్నిక



ఎన్నికలో పాల్గొన్న గణపర్తి పాడి రైతులు

మునగపాక:మండలంలోని గణపర్తి పాలసంఘం డైరెక్టర్ల ఎన్నిక శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. కర్రి రామనాగేశ్వరరావు,నందవరపు నాయుడు,పి.శ్రీను, చదరం హేమ సంతోష్ డైరెక్టర్లుగా ఎన్నికయ్యారు. ఉదయం నుంచి పాడి రైతులు తమ ఓటుహక్కును చేతులెత్తే విధానం ద్వారా వినియోగించుకున్నారు. ఎన్నిక సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు జరగకుండా ఎస్ఐ ప్రసాదరావు బందోబస్తు నిర్వహించారు.

ముమ్మరంగా వరినాట్లు



జల్లూరులో వరి నారు తీస్తున్న కూలీలు

కోటవురట్ల: వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు ముమ్మరంగా వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఖరీఫ్ సాగులో భాగంగా పలు ప్రాంతాలలో వరినాట్లు జోరుగా జరుగుతున్నాయి. నాట్లు వేసే పనుల్లో రైతులు, కూలీలు బిజీగా ఉన్నారు.గత ఏడాది ఖరీఫ్ సీజనులో మండలంలో 1,750 హెక్టార్లలో వరి సాగు చేశారు. ప్రస్తుతం జల్లూరు, యండపల్లి, బి.కె.పల్లి, పాములవాక, అన్నవరం, కైలాసపట్నం, రాజుపేట, కోటవురట్ల, లింగాపురం, కె.వెంకటాపురం, రామచంద్రపురం, నీలిగుంట, రామచంద్రపాలెం ప్రాంతాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి.

ఆరుబయట మల విసర్జనకు స్వస్తి చెప్పాలి

మునగపాక: ఆరుబయట మలవిసర్జనకు స్వస్తి చెప్పాలని ఎంపీడీవో ఎం.మన్మధరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు,సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరుబయట మల విసర్జన వల్ల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలన్నారు. బహిరంగ మరుగుదొడ్లు లేకుండా చూడాలని సూచించారు. ఈవోఆర్డీ వెంకటలక్ష్మి,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ధర్మ రక్షణ బంధన్



సమసరత సేవా ఫౌండేషన్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యులు

అచ్యుతాపురం: ఈ నెల 16 నుంచి 22 వరకూ ధర్మ రక్షణ బంధన్ నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ యలమంచిలి ఖండ సంయోజకులు బి.వి రమణ తెలిపారు.అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం-అందలాపల్లి భగీరథమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్తీక పౌర్ణమి నాడు దేవాలయాల్లో సామూహిక హారతి ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో కొల్లి అప్పారావు,గుడివాడ రమణ,చోడపల్లి సత్యం ,ఆడారి త్రినాథ్,భీశెట్టి దేవి,దొడ్డి కృష్ణ,పేర్ని గోవింద,భీశెట్టి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల హాల్టు కోసం ఎమ్మెల్యేకు వినతి

యలమంచిలి రూరల్: స్థానిక రైల్వేస్టేసన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టు సౌకర్యం కల్పించడంతోపాటు ప్రయాణికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌కు స్థానిక రైల్వే పాసింజర్ల సంక్షేమ సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం యలమంచిలి రైల్వే స్టేషన్‌ను పరిశీలించడానికి వచ్చిన సుందరపు విజయ్ కుమార్‌ను పలువురు సీనియర్ సిటిజన్లు,డైలీ పాసింజర్లు కలిసి, రైల్వేస్టేషన్‌లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మహబూబ్‌నగర్, రత్నాచల్, కోణార్క్, ప్రశాంతి, చెన్నై మెయిల్, ఏపీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రానుపోను యలమంచిలిలో హాల్టు సౌకర్యం కల్పించాలని, మిగతా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కరెంట్ కష్టాలు తీరేదెన్నడో ?

- గాలి వీచినా...వర్షం పడినా విద్యుత్ సరఫరా బంద్
- నిరంతర విద్యుత్ కోతలతో అల్లాడుతున్న ప్రజలు
- సమస్య పరిష్కరించాలని పది గ్రామాల ప్రజల విజ్ఞప్తి



కలెక్టర్ అందజేసిన చేసిన అర్జీ కాపీని చూపిస్తున్న విద్యుత్ బాధితులు

అచ్యుతాపురం: చిన్న పాటి గాలి వీచినా... కొద్ది పాటి వర్షం పడినా... ఎక్కడైనా లైన్ నిర్వహణ పనులున్నా ఆ గ్రామాలకు విద్యుత్ సరఫరా బంద్ అవుతుంది. విద్యుత్ ఎప్పుడు పోతుందో..ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితిలో పది గ్రామాల ప్రజలు కొట్టు మిట్టాడుతున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని అధికారుల వద్ద మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. మండల పరిషత్ సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఈ సమస్యను ప్రస్తావించినా మౌనమే సమాధానవుతోంది. చివరకు ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో కలెక్టర్‌కు అయా గ్రామాల ప్రజలు వినతి పత్రం సమర్పించినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో అయా గ్రామస్తులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఉక్కపోత, దోమల మోతతో అల్లాడిపోతున్నారు. పిల్లలు, వ్యాధి గ్రస్తుల పరిస్థితి దారుణంగా ఉంది. ఎన్టీపీసీకి అత్యంత సమీపంలో ఉన్న అచ్యుతాపురం మండలంలోని ఇరువాడ, దొప్పెర్ల, నారపాక, నడింపల్లి తదితర పది గ్రామాల ప్రజలు వేళాపాళాలేని విద్యుత్ కోతల కారణంగా తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

పరిధిపై అస్పష్టత...

ఈ గ్రామాల పరిధికి సంబంధించి ఇటు పరవాడ సబ్‌స్టేషన్,అటు అచ్యుతాపురం సబ్ స్టేషన్ సిబ్బంది ఇచ్చే సమాధానం విచిత్రంగా ఉంటోందంటూ స్థానికులు వాపోతున్నారు. పరిధిపై స్పష్టంగా చెప్పడం లేదని తెలిపారు. చీమలాపల్లిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు చేస్తే తమ గ్రామాల్లో విద్యుత్ కోత విధించడం ఏంటని ఇక్కడి వారు ప్రశ్నిస్తున్నారు. విద్యుత్ వైర్లపై చెట్లు కొమ్మలు పడితే కనీసం నాలుగైదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ఈ ప్రాంత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యుత్ కోతల కారణంగా నిత్యం చేయవలసిన పనులు నిలిచిపోతున్నాయని, వ్యాపారులకు నష్టం వస్తోందని వారు తెలిపారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి

అచ్యుతాపురం,పరవాడ శివారు ప్రాంతాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ వెతలు తీర్చేందుకు సబ్ స్టేషన్ ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. విద్యుత్ కోతలతో పాటు లోఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని వారు తెలిపారు.

> **త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం.**
>
> దొప్పెర్ల,నారపాక,నడింపల్లి,ఇరువాడతో పాటు 13 కిలో మీటర్ల పరిధిలో ఉన్న లైన్‌లో విద్యుత్ సమస్యలు ఉన్న సంగతి మా దృష్టికి వచ్చింది.గతంలో ఇది ఫార్మాసిటీ పరిధిలో ఉండేది. ఆగస్టు ఒకటో తేదీ నుంచి మా పరిధిలోకి మార్చారు.ఆయా గ్రామాల విద్యుత్ సరఫరా పర్యవేక్షణ వాడచీపురుపల్లి సబ్‌స్టేషన్‌లో లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సమస్యను పరిష్కరిస్తాం.
>
> – కృష్ణ, విద్యుత్‌శాఖ ఏఈ (అచ్యుతాపురం ఇన్‌చార్జ్)

అందరి అభీష్టం మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స ఎంపిక



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు



మాజీ సీఎం జగన్‌తో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు

మునగపాక/నక్కపల్లి/కోటవురట్ల: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి అభ్యర్థి ఎంపికపై మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకుల అభిప్రాయాన్ని తీసుకున్నారని, అందరి అభీష్టం మేరకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను ఎంపిక చేశారని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్ఎస్ సీతారామరాజు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించిన అభ్యర్థి ఎంపిక కోసం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన పార్టీ నేతల సమావేశానికి వీరు హాజరయ్యారు. ఈ నెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలో పార్టీ అభ్యర్థి,మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను గెలపించాలని జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని తెలిపారు. పార్టీకి నేతలంతా సమన్వయంతో పనిచేసి బొత్స సత్యనారాయణకు అండగా నిలవాలని చెప్పారని వారు తెలిపారు. యువనాయకులు డి.బి.వి.రాజగోపాలరాజు, నారాయణమూర్తిరాజు తదితరులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

ఎస్.రాయవరంలో నిలిచిన పారిశుధ్య పనులు

- వేతనం తగ్గించడంతో విధులకు హాజరుకాని కార్మికులు
- గ్రామంలో పేరుకుపోయిన చెత్త



మెయిన్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఎస్.రాయవరం: మండలకేంద్రం ఎస్.రాయవరంలో పారిశుధ్య కార్మికులు రెండు రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. ఇటీవల కాంట్రాక్ట్ కార్మికులతో పారిశుధ్య పనులు నిర్వహణకు టెండరు ఖరారైంది. గత ఏడాది వేతనాలతో పోలిస్తే ఈ సారి ఒక్కో కార్మికుడికి రూ.రెండు వందలు తగ్గనుంది. నెలవారీ వేతనం రూ. 10,800 గా నిర్ణయించి, చెల్లించేందుకు గ్రామానికి చెందిన కాంట్రాక్టరు కశింకోట శ్రీనివాసరావు పాట దక్కించుకున్నారు. అయితే విషయం తెలుసుకున్న కార్మికులు ఆవేదన చెందారు. కొన్నేళ్లుగా పనిచేస్తున్న తమకు వేతనాలు పెంచక పోగా తగ్గించి ఇస్తారా, అని మండిపడ్డారు. వేతనాలుపెంచకపోతే విధులకు తాము హాజరుకాబోమని స్పష్టం చేశారు. రెండు రోజులుగా పారిశుధ్య పనులు చేపట్టక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. దీంతో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్‌ని సంప్రదించారు. కార్మికులు వెంటనే విధుల్లో చేరకపోతే తాము ఇచ్చే నోటీసు కి సమాధానం ఇవ్వాలన్నారు. ఈ మేరకు కాంట్రాక్టరు ఒక్కరోజు గడువు తీసుకుని శనివారం నుంచి పారిశుధ్య పనులు చేయిస్తానని చెప్పినట్టు కార్యదర్శి తెలిపారు. శనివారం సమస్య పరిష్కారం కాకపోతే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



యలమంచిలిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



పొలం బడి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు

నక్కపల్లి: సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని, పొలం బడిద్వారా ఆ పద్ధతులను రైతులకు తెలియజేస్తున్నామని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్ రావు తెలిపారు. మండలంలోని ఉద్దండపురంలో శుక్రవారం పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మోహన్‌రావు మాట్లాడుతూ నారు మడి నుంచి పంట కోత వరకు పాటించాల్సిన మెలకువలను, విత్తన శుద్ధి, కలుపు యాజమాన్యం, సమగ్ర చీడపీడల యాజమాన్యం, సమగ్ర సస్య రక్షణ గురించి వివరించారు. మేలైన యాజమాన్య పద్ధతులు ఎలా అవలంబించాలో తెలిపారు. నారు ఉడిచే ముందు కొనలను తుంచి నాటుకోవాలని, ఇలా నాటడం వల్ల ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించవచ్చని తెలిపారు. అదే విధంగా సుడొమోనస్ ద్రావణంలో వేరులు ముంచి నాటుకోవడం వల్ల పాడ తెగులు నివారించవచ్చన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీధర్ మాట్లాడుతూ మేలైన ధరలు కల్పించడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ మండల వ్యవసాయ అధికారులు ఉమా ప్రసాద్, వి.ఎ.ఎ. రాకేష్, రైతు సేవ కేంద్ర సిబ్బంది, రైతు ఉత్పత్తి దారుల సంఘ ప్రతినిధులు సత్యనారాయణ, చంద్రిక తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వినియోగంపై అవగాహన

యలమంచిలి రూరల్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు వ్యవసాయశాఖాధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ముందుగా రాపేటి శ్రీను అనే రైతు పొలంలో పొటాష్ రిలీజింగ్ బ్యాక్టీరియా వాడే విధానాన్ని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో అన్నదాతలకు కావల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఏవో మోహన్‌రావు మాట్లాడుతూ రసాయన ఎరువులు కన్నా జీవన ఎరువులు వినియోగించడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు.జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాకులు శ్రీధర్, ఏవో సరోజినీ, ఎంపీఈవో అరుణ, అభ్యుదయ రైతులు వెంకట రమణ, చల్లారావు, సూరి అప్పారావు,రాము పాల్గొన్నారు.

ఘనంగా పింగళి వెంకయ్య జయంతి



పెదోదుగల్లంలో నివాళులర్పిస్తున్న హెచ్ఎం తదితరులు



పి.ధర్మవరంలో పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి: మండలంలో పెదోదుగల్లం హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ పతాకం రూపకర్త, స్వాతంత్ర్య సమరయోధుడు పింగళి వెంకయ్య జయంతిని ప్రధానోపాధ్యాయుడుసీహెచ్.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళిలర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ భారత జాతీయ పతాకం రూపకల్పనలో పింగళి వెంకయ్య చేసిన కృషిని వివరించారు. ఉపాధ్యాయులు ఎస్.వి.ఎస్. ఆచార్యులు, ఎస్.ఫాల్గుణరావు తదితరులు మాట్లాడుతూ పింగళి వెంకయ్య సేవలు చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎ.వి.ఎల్.ఎస్. కుమారి, చిన్నారావు, రమేష్‌బాబు, శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు నివాళి

ఎస్.రాయవరం:జాతీయ జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య జయంతిని పి.ధర్మవరం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు,ఉపాధ్యాయులు వెంకయ్యకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కుమారి, ప్రకాష్, లలితాంబ,శోభారాణి,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఎంసీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

- జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈవో అప్పారావు

నక్కపల్లి: పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ)ఎన్నికలు ఈనెల 8న ప్రశాంతంగా నిర్వహించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి శుక్రవారం ఆయన నక్కపల్లిలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ కమిటీల్లో ప్రధాన పాత్రదారులు ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులేనన్నారు. ఒక్కో తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకోవలసి ఉంటుందన్నారు. వీరిలో సామాజిక ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలనుంచి ఒకరు, బలహీన వర్గాలనుంచి ఒకరు, జనరల్ కేటగిరినుంచి ఒకరిని ఎన్నుకోవాలని తెలిపారు. ఈ ముగ్గురిలో ఇద్దరు మహిళలు ఉండాలని చెప్పారు. ఎన్నికల నిర్వహణకు కనీసం 50 శాతం తల్లిదండ్రులు లేదా సంరక్షకులు హాజరుకావాలని తెలిపారు. నోటిమాటతోనే గానీ, చేతులను పైకి ఎత్తడం ద్వారా గానీ, రహస్య బ్యాలెట్ విధానం ద్వారా గానీ ఎన్నికలను నిర్వహించాలని తెలిపారు. పిల్లల తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరికి మాత్రమే ఎన్నికల్లో ఓటు వేసే అర్హత ఉంటుందన్నారు.పాఠశాలల్లో ఎన్ని తరగతులు ఉంటే అన్ని తరగతులనుంచి సభ్యులను ఎన్నుకోవాలని తెలిపారు.ఎన్నికల నిర్వహణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఎంఈవో కె. నరేష్ హెచ్ఎంలు వేమగిరి నూకరాజు, సీహెచ్ సత్యనారాయణ,మూర్తిరాజు, రాణి లలిత, సత్యారావు,త్రినాదరావు,ఉపాధ్యాయులు ఆచార్యులు, డి.వి. సన్యాసిరావు,కొండలరావు, వెంకటరావు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు



పట్టణంలో విద్యుత్ లైన్లపై తొలగించిన చెట్ల కొమ్మలు

యలమంచిలి రూరల్: జంగిల్ క్లియరెన్స్‌లో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ వైర్లపైగల చెట్ల కొమ్మలను శుక్రవారం తొలగించారు. ప్రధాన రహదారి,తులసీనగర్, జలాల్‌వీధి, ఎన్టీఆర్ కాలనీ,ఫైర్ ఆఫీస్ కాలనీ,కాకివాని వీధి ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను నరికించారు. దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.తిరిగి సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పట్టణంలో ఆంధకారం అలముకుంది.ఇటీవల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని, ఎలాంటి సమాచారం లేకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని పట్టణ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిపాలు అమృతతుల్యం



చూచుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



నక్కపల్లిలో ర్యాలీ చేస్తున్న సిబ్బంది



ఎస్.రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మడుతూరులో నిర్వహించిన అవగాహన ర్యాలీ



చీమలాపల్లిలో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

మునగపాక:తల్లిపాలలో మెరుగైన పోషక విలువలు ఉంటాయని, తల్లిపాలు పట్టడం వల్ల బిడ్డకు మేలు జరుగుతుందని చూచుకొండ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా చూచుకొండ వైద్యాధికారి ఎస్తేర్‌రాణి ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అమృతంతో సమానమన్నారు.గర్భిణులు,బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మణ్,హెచ్‌వీ బేగం,ఏఎన్ఎం కృష్ణవేణి,ఎంఎల్‌హెచ్‌పీ కళావతి,అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో

ఎస్.రాయవరం: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. మండల కేంద్రం ఎస్.రాయవరంలో శుక్రవారం గ్రామంలో తల్లిపాలవారోత్సవాలు అవగాహన ర్యాలీ నిర్వహించారు.బిడ్డకు తల్లి పాలు పట్టడం వల్ల వ్యాధి నిరోధిక శక్తి పెరుగుతుందని చెప్పారు. పాలు ఇవ్వని తల్లులకు రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదముందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బంది, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరరావు,హెల్త్ సూపర్ వైజర్ వి.ప్రకాస్ పాల్గొన్నారు.

తల్లిపాలలో పోషకగుణాలు అధికం

నక్కపల్లి: తల్లిపాలలో ఎన్నో పోషక గుణాలు ఉన్నాయని, పుట్టిన శిశువులకు తల్లిపాలు ఇవ్వడం ఎంతో శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లలిత అన్నారు. తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నక్కపల్లిలో ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. చాలా మంది ఈవిషయం తెలియకపోవడం వల్ల పుట్టిన శిశువులకు పట్టుపాలు, పిండిపాలు పడుతున్నారని తెలిపారు. తల్లులకు అవగాహన కల్పించడం కోసమమే వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.అంగన్‌వాడీ సిబ్బంది తల్లిపాల వారోత్సవాలపై కేంద్రాల్లో ఆవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.ఈ ర్యాలీలో అంగన్‌వాడీ సిబ్బంది దుర్గారాణి,సౌజన్య,తులసి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు సురక్షితం

అచ్యుతాపురం: తల్లిపాలు పిల్లలకు ఎంతో సురక్షితమైనవని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి వసంత్‌కుమార్ అన్నారు.తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని చీమలాపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ తల్లిపాలను పిల్లలకు ఇవ్వడం వల్ల ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, సునీత,గాయత్రి దేముడమ్మ,గణపతి,శిరీషా పాల్గొన్నారు. మండలంలోని మడుతూరులో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పైడికొండ, సీహెచ్‌వో పద్మకుమారి,అంగన్‌వాడీ కార్యకర్తలు కుమారి,రేవతి,ఆశా కార్యకర్త లక్ష్మి,గర్భిణులుబాలింతలు పాల్గొన్నారు.

‘చక్కని పాలన అందిస్తాం’

అచ్యుతాపురం: ప్రజలు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా చక్కని పాలన అందిస్తామని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎస్‌కేఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం నిర్వహించిన కూటమి పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బాధ్యతతో పనిచేసి ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు,జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ,బీజేపీ నియోజక ఇన్‌చార్జ్ నాయుడు,రాజాన రమేష్‌కుమార్, బైలపూడి రాందాసు, లాలం చందు,రంగనాయకులు,జనపరెడ్డి శ్రీనివాసరావు,జనపరెడ్డి నర్సింగరావు,డి.ఎస్.ఎస్. రాజు,దిన్‌బాబు,కొరుప్రోలు చిన్నారావు,ద్వారపురెడ్డి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీల ఎంపికకు క్షేత్రస్థాయి పరిశీలన

నాతవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలున్న నాలుగు ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నామని ఎంపీడీవో జాగరలరాంబాబు తెలిపారు. మండలంలో వల్సంపేట, వై.బి.అగ్రహారం, పెదగొలుగొండపేట, పి.కె.గూడెం పంచాయతీల్లో శుక్రవారం సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో శత శాతం మరుగుదొడ్లు, విద్య, వైద్యం, తాగునీటి సదుపాయం , తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంతవరకు చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో నాలుగు ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసేందుకు కలెక్టరుకు నివేదిక పంపిస్తామన్నారు. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికై తే ప్రభుత్వం నుంచి పురస్కారాలతో పాటు మరింత అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరవుతాయన్నారు. వీటిన్నింటిని దృష్టిలో పెట్టుకుని మిగిలిన పంచాయతీ పాలక వర్గాల సభ్యులు, అధికారులు సంయుక్తంగా అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.ఎన్.వి. మూర్తి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యలమంచిలి రూరల్: మున్సిపాలిటీలో పెదపల్లి 33/11కేవీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం రాంనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. శేషు కొండకాలనీ, రాంనగర్, ఏఎస్సార్ కాలనీ, మారిబంద, పాత ఎర్రవరం ప్రాంతాల్లో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె. రాజశేఖర్ తెలిపారు.